కాకినాడ జిల్లా పెద్దాపురంలో అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న కార్మికులు

4వ రోజూ సమ్మె ఉధృతం

అస్తవ్యస్తంగా పారిశుధ్యం

ప్రజాశక్తి-యంత్రాంగం

ప్రభుత్వ అసమర్థతతో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ కార్మికులు సమ్మెను కొనసాగిస్తుండడంతో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయింది. సమ్మె విరమించి చర్చలకు రావాలని మంత్రులు కోరుతున్నా... స్పష్టమైన హామీలు ఇచ్చే వరకు ఆందోళన విరమించబోమని కార్మికులు తెగేసి చెబుతున్నారు. సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి ప్రభుత్వం పలు జిల్లాల్లో ప్రయివేటు కార్మికులతో పని చేయిస్తుండడంతో కార్మికులు అడ్డుకున్నారు. మున్సిపల్ కార్మికుల సమ్మె గురువారంతో నాలుగోరోజుకు చేరింది. రాష్ట్ర వ్యాప్తంగా భిక్షాటనలు, అర్ధనగ్న ప్రదర్శనలు, మానవహారాలు, ర్యాలీలు, ధర్నాలు చేశారు. అనంతపురంలో నగర పాలకసంస్థ పాలక వర్గం, మున్సిపల్ అధికారులు సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు యత్నించారు. మేయర్ మహమ్మద్ వసీం, వైస్ చైర్మన్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్య, కమిషనర్ భాగ్యలక్ష్మిలు కార్పొరేషన్ ఎదుట చీపుర్లు పట్టి రోడ్లు శుభ్రం చేసేందుకు ప్రయత్నించగా కార్మికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించకుండా పాలకవర్గం ఇలా చేయడం ఏమిటని నిలదీశారు. కార్పొరేటర్లు, అధికారులు ముందుకు వెళ్లకుండా రోడ్డుపై అడ్డంగా పడుకుని నిరసన తెలిపారు. సమ్మెను విచ్ఛిన్నం చేసే ఇలాంటి కుట్రలను మానుకోవాలని మేయర్, కమిషనర్‌కు కార్మిక సంఘం నాయకులు సూచించారు. విశాఖ జివిఎంసి పరిధిలోని గాజువాక, కంచరపాలెం జోన్లలో పోలీసుల సాయంతో క్లాప్ వాహనాలను తీసుకెళ్లే ప్రయత్నం చేయగా పారిశుధ్య కార్మికులు అడ్డుకున్నారు. గాజువాకలో జరిగిన తోపులాటలో మహిళా కార్మికురాలు స్పృహ కోల్పోయి కిందపడిపోయింది. సిఐటియు జోన్ కార్యదర్శి ఎం.రాంబాబుతో సహా 16 మంది కార్మికులను పోలీసులు అరెస్టు చేశారు. కంచరపాలెంలోని తాటిచెట్లపాలెం సీవేజ్ ఫారం వద్ద కార్మికులు శాంతియుతంగా సభ నిర్వహిస్తుండగా పోలీసులు అడ్డుకుని పలువురిని అరెస్టు చేశారు. అప్పుఘర్, భీమిలిలో వంటావార్పు నిర్వహించారు. విజయనగరంలోని కార్పొరేషన్ కార్యాలయం ఎదుట చెవిలో పువ్వులు పెట్టుకొని, పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండలో మెడకు ఉరితాళ్లు వేసుకొని నిరసన తెలిపారు. సాలూరులో దున్నపోతుకు వినతినిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయం ధర్నాలో ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మాట్లాడుతూ.. సిఎం జగన్మోహన్‌రెడ్డి ఎన్నికలకు ముందు మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. కార్మికుల సమస్యలపై ఈ నెల 19వ తేదీ నుండి జరిగే శాసనమండలి సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదిస్తామని తెలిపారు. జంగారెడ్డిగూడెంలో మున్సిపల్ అధికారులు పట్టణంలో చెత్తను తరలించడానికి ప్రయివేటు సిబ్బందిని నియమించడంతో వారిని కార్మికులు అడ్డుకున్నారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో సిఐటియు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ధనాల వెంకట్రావు పాల్గొన్నారు. గుంటూరు జిల్లా తెనాలిలో ప్రయివేటు కార్మికులు చెత్త ట్రాక్టర్‌లను తీసుకెళ్తుండగా కార్మికులు అడ్డుకొని నిరసన తెలిపారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా మండపేటలో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్మికుల సమ్మెలో భాగంగా వైఎస్ఆర్ టియుసి ఆధ్వర్యంలో కర్నూలు స్కంద కాంప్లెక్స్ నుండి కొండారెడ్డి బురుజు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. తెలుగు తల్లి విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో చెత్త సేకరణ ఆటోలు కార్పొరేషన్ కార్యాలయం నుంచి బయటకు రాకుండా కార్మికులు అడ్డుకున్నారు. బాపట్ల జిల్లాలో రేపల్లె-గుంటూరు ప్రధాన రహదారిపై భోజనాలు చేసి నిరసన తెలిపారు. చిత్తూరులో గాంధీ విగ్రహం వద్ద చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన తెలిపారు. పలమనేరులో వంటావార్పు చేశారు. పశ్చిమగోదావరి, అనకాపల్లి, శ్రీకాకుళం, తూర్పుగోదావరి, కాకినాడ, కృష్ణా, ఎన్‌టిఆర్ విజయవాడ, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, కడప జిల్లాల్లో భిక్షాటన, అర్ధనగ్న ప్రదర్శనలు చేశారు. మోకాళ్లపై నిల్చుని నిరసన తెలిపారు. మానవహారాలు, ధర్నాలు, ర్యాలీలు నిర్వహించారు.

కాలయాపన వద్దు

సిఎం జోక్యం చేసుకోవాలి
మున్సిపల్ సమ్మెపై బివి రాఘవులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మున్సిపల్ కార్మికుల సమస్యలను కాలయాపన చేయకుండా తక్షణం పరిష్కరించాలని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు డిమాండ్ చేశారు. విజయవాడలోని మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికుల సమ్మెకు గురువారం ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమ్మె విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేసే విధంగా వ్యవహరిస్తోందని,ఈ ధోరణి మంచిది కాదన్నారు. 'సమస్యను పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నారా? కాలాయపన ద్వారా సమ్మెను విచ్ఛిన్నం చేయాలనుకున్నారా?' అని సిఎం జగన్‌ను ఉద్దేశించి ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో విస్తారంగా కురుస్తున్న వర్షాలను దృష్ట్యా ప్రజారోగ్య పరిరక్షణను పరిగణనలోకి తీసుకుని ముఖ్యమంత్రి తక్షణం జోక్యం చేసుకుని కార్మికుల కోర్కెలను అంగీకరించి సమ్మెను విరమింపచేయాలన్నారు. మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేస్తానంటూ ప్రతిపక్ష నేతగా జగన్ ఇచ్చిన హామీని గుర్తు చేశారు. ఆ హామీని ఇప్పుడు మంత్రులపై వదిలేస్తున్నారని విమర్శించారు. హామీ అమలు చేయకపోతే ముఖ్యమంత్రికే నష్టమని చెప్పారు. రెండేళ్ల నుంచి పనిచేస్తున్న గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను రెగ్యులర్ చేసినప్పుడు, ఏళ్ల తరబడి నుంచి పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులను ఎందుకు రెగ్యులర్ చేయడం లేదని ప్రశ్నించారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే పనిలోనే ఉన్నా అలవెన్స్ ఎందుకు తొలగిస్తారని ప్రశ్నించారు. వివిధ కారణాలు చెబుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను మున్సిపల్ కార్మికులకు రద్దు చేశారన్నారు. సమ్మెను విరమించుకుని చర్చలకు రావాలని మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడటం గౌరవం అనిపించుకోదని, అహంకారంలా ఉంటుందన్నారు. రాష్ట్రప్రభుత్వాన్ని రద్దు చేస్తేనే ప్రత్యేక హోదా, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై చర్చిస్తామని కేంద్రప్రభుత్వం అంటే ఎలా ఉంటుందని ప్రశ్నించారు. వైసిపి దళిత, గిరిజన బంధువని ప్లీనరీలో చెప్పిన మాటలను ఆచరణలో పెట్టాలని సూచించారు. విజయవాడ నగరంలోని కార్మికులు నాలుగుసార్లు ఐరిష్ వేయాలన్న నిబంధనను తొలగించాలని డిమాండ్ చేశారు . గత్యంతరం లేని పరిస్థితుల్లోనే సమ్మె జరుగుతోందని, ప్రభుత్వం దీనిని అర్థం చేసుకొని సమస్యను పరిష్కరించేందుకు ముందుకు రావాలని కోరారు. లేదంటే సమస్యను ఇంకా తీవ్రతరం చేసి సమ్మెను ఉధృతం చేస్తామని, కార్మికవర్గం మొత్తం ఉద్యమంలోకి వస్తుందని హెచ్చరించారు. సిపిఎం రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు మాట్లాడుతూ కార్మికులకు పోటీగా ఇతరులను తీసుకొచ్చి పనిచేయించేందుకు రాష్ట్రప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కార్మికులకు వేతనాలు చెల్లించని ప్రభుత్వం పోటీగా చేసేవారికి రోజుకు రూ.700లు, రూ.1000లు చెల్లిస్తోందన్నారు. మున్సిపల్ జెఎసి కన్వీనర్(సిఐటియు) కె ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ జెఎసిని విచ్ఛిన్నం చేసే విధంగా రాష్ట్రప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. సమ్మె నోటీస్ ఇవ్వని వారితో సమ్మె విరమింపచేస్తున్నామని చెప్పిస్తున్నారన్నఇ అన్నారు. జెఎసి నాయకులు పి సుబ్బరాయుడు(ఎఐటియుసి) మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన జిఓను అమలు చేయకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టిఎన్‌టియుసి రాష్ట్రనాయకులు గొట్టిముక్కల రఘురాం, సిపిఎం రాష్ట్ర నాయకులు, దోనేపూడి కాశీనాథ్, సిపిఎం కార్పొరేటర్ సత్యంబాబు తదితరులు పాల్గొన్నారు.

విజయవాడలో మున్సిపల్ కార్మికుల పోరాటానికి మద్దతు తెలియజేస్తున్న బివి రాఘవులు

మున్సిపల్ కార్మికుల సమ్మెకు జెఎసి మద్దతు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ రెగ్యులర్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న సమ్మెకు ఎపి స్టేట్ గవర్నమెంటు కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ టీచర్స్ వర్కర్స్ జెఎసి సంపూర్ణ మద్దతు తెలిపింది. ఈ మేరకు గురువారం జెఎసి ఛైర్మన్ ఎవి నాగేశ్వరరావు, సెక్రటరీ జనరల్ ఎం బాలకాశి, కో-ఛైర్మన్ విజయ్‌కుమార్‌రాజు ప్రకటన విడుదల చేశారు.

రాష్ట్రంలో 55 వేలమంది కార్మికులు కరోనా కాలంలోనూ ఫ్రంట్‌లైన్ వర్కర్లుగా వారి సేవలను అందించారని తెలిపారు. అప్పట్లో వారిని కొనియాడిన ముఖ్యమంత్రి సమస్యలు పరిష్కారం చేయకుండా తాత్సారం చేయడం అన్యాయమని అన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ కార్మికుల హెల్త్ అలవెన్స్‌తో కలిపి రూ.21 వేల వేతనం అమలు చేయాలని జెఎసి డిమాండు చేసింది. వెంటనే జెఎసి నాయకత్వంతో చర్చించి సమస్యలు పరిష్కరించాలని కోరింది.

ఎఐఎఫ్‌టియు (న్యూ) మద్దతు

మున్సిపల్ కార్మికుల సమ్మెకు ఎఐఎఫ్‌టియు (న్యూ) సంపూర్ణ మద్దతు తెలిపింది. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సి పెద్దన్న, జాస్తి కిషోర్‌బాబు ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం మొండి వైఖరే సమ్మెకు కారణమని తెలిపారు. అనారోగ్యకర పరిస్థితుల్లో పనిచేయడం వల్ల కార్మికుల ఆరోగ్యం దెబ్బతింటోందని తెలిపారు. మ్యాన్‌హోల్లలో జరిగే ప్రమాదాల్లోనూ చనిపోతున్నారని వివరించారు. నెలకు రూ.21 వేల ఇస్తామన్న హామీని సిఎం నిలబెట్టుకోవాలని కోరారు.

పిఎసిఎస్ ఎంప్లాయీస్ యూనియన్

సమ్మెకు ఎపి అగ్రిక్చరల్ కో-ఆపరేటివ్ సొసైటీ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) మద్దతు ప్రకటించింది. ఈ మేరకు సంఘం గౌరవాధ్యక్షులు అజయ్‌కుమార్, అధ్యక్షులు వివి సత్యనారాయణరాజు, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి వెంకట్రామయ్య ప్రకటన విడుదల చేశారు. సమస్యలను పరిష్కరించి, సమ్మెను విరమింపజేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇచ్చిన హామీని విస్మరించారు : ఐఎఫ్‌టియు

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఐఎఫ్‌టియు రాష్ట్ర కార్యదర్శి పొలారి కోరారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉండగా ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తరువాత పూర్తిగా విస్మరించారన్నారు. ఇప్పుడు మున్సిపల్ కార్మికుల పరిస్థితి పెనం మీద నుండి పొయ్యిలోకి తోసినట్లయిందన్నారు.

చెరువుల తవ్వకాలకు అనుమతి తప్పనిసరి : హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

అనుమతులు తీసుకున్న తర్వాతే పంట పొలాలను చెరువులుగా మార్చుకోవాలని, అనుమతుల్లేకుండా చెరువుల్ని తవ్వితే కుదరదని హైకోర్టు తీర్పు వెలువరించింది. చట్టం గురించి తెలియదని, చెరువు తవ్వేశామని అమాయకంగా చెబితే కుదరదని స్పష్టం చేసింది. ఎపి స్టేట్ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంటు అథారిటీ యాక్టు ప్రకారం చెరువులుగా మార్చేందుకు పర్మిషన్ తీసుకోవాల్సిందేనని న్యాయమూర్తి జస్టిస్ ఎం గంగారావు తీర్పు చెప్పారు.

తూర్పుగోదావరి జిల్లా, జగ్గయ్యపేట మండలం, కాట్రవులపల్లిలోని పలు సర్వే నెంబర్లలో పంట భూములను శివకోటి గోవిందు సహా ఏడుగురు చట్ట వ్యతిరేకంగా చెరువులు తవ్వడాన్ని తప్పుపడుతూ గాయత్రి హౌసింగ్ మేనేజింగ్ పార్ట్‌నర్ పి ప్రభాకరరావు రిట్ దాఖలు చేశారు. అక్కడి తమ భూములు 7.80 ఎకరాల్లో చట్ట ప్రకారం నివాస స్థలాలకు లేఅవుట్ వేశామని, అక్కడ గోవిందు ఇతరులు చట్ట వ్యతిరేకంగా చెరువులు తవ్వుతుంటే అధికారులు చర్యలు తీసుకోవడం లేదని పిటిషనరు వాదించారు. తమ సరిహద్దు భూముల్లో చెరువులు ఉన్నందున తాము సాగు చేసుకోలేకపోతున్నట్లు, అందుకే చెరువు తవ్వుతున్నట్లు గోవిందు ఇతరులు చెప్పారు. ఇందుకు అనుమతి కోరుతూ దరఖాస్తు చేసుకుంటే అధికారులు స్వీకరించలేదన్నారు. వాదనల తర్వాత హైకోర్టు స్పందిస్తూ.. 2015లో ప్రభుత్వం జిఓ 15 జారీ చేసిందని, అనుమతులు తీసుకున్న తర్వాతే చెరువులు తవ్వాలని, అనుమతుల్లేకుండా చెరువుల తవ్వకాలకు చట్టబద్ధత ఉండదని తీర్పు చెప్పింది.

పనుల వేగం పెంచండి

(మొదటిపేజీ తరువాయి)

పరంగా, సౌకర్యాల పరంగా అత్యంత వెనకబడ్డ ప్రాంతం ఇదేనని అన్నారు. ఈ ప్రాంతం నుంచి కొనసాగుతున్న వలసలను నివారించడానికి కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. భూమిలేని వారికి కనీసం ఒక ఎకరా భూమైనా ఇవ్వాలని అన్నారు. ఈ ప్రాంతంలో ఇరిగేషన్, తాగునీటి పథకాలను ప్రాధాన్యతా క్రమంలో చేపట్టాలని దీనివల్ల పనులు అందుబాటులోకి వస్తే వలసలను పూర్తిస్థాయిలో నివారించ గలుగుతామని అన్నారు. ఈ సమీక్షా సమావేశంలో జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు, సీఎస్ సమీర్ శర్మ, జలవనరులశాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఆర్థికశాఖ స్పెషల్ సీఎస్ ఎస్ఎస్ రావత్, ఈఎన్‌సీ సి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ఆశాల గళం

- రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు

ప్రజాశక్తి - యంత్రాంగం

ఆశా కార్యకర్తలు రోడెక్కారు. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఆశా వర్కర్స్ యూనియన్(సిఐటియు) ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు చేపట్టారు. కనీస వేతనం రూ.15వేలు చెల్లించాలని, పనిభారాన్ని తగ్గించాలని, సంక్షేమపథకాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, కోవిడ్ కాలంలో మరణించిన ఆశాల కుటుంబాలకు 10 లక్షలు ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలని నినదించారు.

ఆశా కార్యకర్తల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం తగదని ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి అన్నారు. విజయవాడ ధర్నా చౌక్‌లో వందలాది మంది ఆశా కార్యకర్తలు ఆందోళనలో పాల్గొన్నారు. ధనలక్ష్మి మాట్లాడుతూ.. ప్రభుత్వ సెలవులు, సంక్షేమ పథకాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఏలూరు కలెక్టరేట్ వద్ద ఆశాలు నిర్వహించిన ధర్నానుద్దేశించి ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మాట్లాడారు. క్షేత్రస్థాయిలో ఎనలేని సేవలందిస్తున్న ఆశాల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని, సిహెచ్‌డబ్ల్యూలను ఆశాలుగా గుర్తించాలని కోరారు. పాదయాత్ర సందర్భంగా జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ ధవళేశ్వరం కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ధర్నాలో ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పోశమ్మ మాట్లాడారు.

నిత్యావసర ధరలు పెరిగినా ఆశాలకు మాత్రం వేతనం పెరగడం లేదన్నారు. మెటర్నటీ సెలవులు కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నంద్యాలలో ర్యాలీగా వెళ్తున్న ఆశాలను కలెక్టరేట్ ఎదుట పోలీసులు అడ్డగించడంతో అక్కడే కూర్చుని నిరసన తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో పని చేస్తున్న కమ్యునిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్చాలని అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులోని కలెక్టరేట్ వద్ద సిహెచ్‌డబ్ల్యులు ఆందోళన చేపట్టారు. పార్వతీపురం మన్యం జిల్లా ఐటిడిఎ, సీతంపేట ఐటిడిఎ వద్ద కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు ధర్నా చేశారు.ఉమ్మడి అనంతపురం, విశాఖ, చిత్తూరు, ఒంగోలు, నె ల్లూరు, కడప జిల్లాల్లో ఆం దోళనలు నిర్వ హించా రు. పశ్చిమ గోదావరి, విజయనగరం, కర్నూ లు జిల్లాలో ధర్నా నిర్వహించారు.

విఎస్‌పి :విశాఖ కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఆశా కార్యకర్తలు

ఆస్పత్రుల ఆధునీకరణకు రూ.16 వేలకోట్లు

- 492 మందులకు ధరల ఒప్పందం మంత్రి విడదల రజని

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని ప్రభుత్వాస్పత్రుల ఆధునీకరణకు రూ.16 వేలకోట్లు ఖర్చు చేయనున్నట్లు వైద్యారోగ్యశాఖ మంత్రి విడదల రజని తెలిపారు. రాష్ట్ర సచివాలయం ఐదో బ్లాక్‌లో ఎపిఎంఎస్ఐడిసి (ఆంధ్రప్రదేశ్ వైద్య సేవలు, వసతుల అభివృద్ధి సంస్థ)పై సమీక్ష సమావేశం మంత్రి గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గ్రామస్థాయి నుంచి వైద్యారోగ్య వ్యవస్థను పటిష్టపరిచేందుకు వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లను సిఎం వైఎస్ జగన్ తీసుకొచ్చారని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 10,032 వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లు నిర్మాణంలో ఉన్నాయన్నారు. 528 అర్బన్ హెల్త్ క్లినిక్‌లు, 1125 పిహెచ్‌సిలు, 168 ఎపివివిపి ఆస్పత్రుల నిర్మాణం, ఆధునీకరణ, పలాసలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్, 16 మెడికల్ కళాశాలల నిర్మాణం, 13 మెడికల్ కళాశాలల ఆధునీకరణ, ఐదుచోట్ల ట్రైబల్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణం, కడపలో కేన్సర్, మెంటల్ హెల్త్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణం కోసం మొత్తం రూ.16,252 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేస్తోందన్నారు. ప్రభుత్వం ఏకంగా 492 ఔషధాల కొనుగోలుకు ధర ఒప్పందం కుదుర్చుకుందన్నారు. సీజనల్ వ్యాధులకు మందుల కొరత లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. టెండర్లు పిలిచి మందులు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. సమావేశంలో ఎపిఎంఎస్ఐడిసి ఛైర్మన్ చంద్రశేఖరరెడ్డి, ఎపిఎంఎస్ఐడిసి ఎమ్‌డి మరళీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆప్షన్-3 ఇళ్లు పూర్తి చేయాలి: అజయ్ జైన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా ఆప్షన్-3లో నిర్మిస్తున్న ఇళ్లను సత్వరమే పూర్తి చేయాలని గృహ నిర్మాణశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ ఆదేశించారు. జిల్లాల గృహ నిర్మాణశాఖ అధికారులతో గురువారం వీడియో సమావేశం నిర్వహించారు. ఇసుకను సేకరించటం, ఇటుకుల తయారీ యూనిట్లను తక్షణమే ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అన్నారు.

రాజ్యాంగ విలువలను దిగజార్చారు

(మొదటిపేజీ తరువాయి)

ప్రముఖులు, రాజకీయ పార్టీల నుండి విమర్శలు వస్తున్నాయని చెప్పారు. పార్లమెంటులో ఏర్పాటు చేసిన స్వాతంత్ర్య సమరయోధుల ఫొటోల్లో నిజమైన వీరులతోపాటు బ్రిటీషువారికి లొంగిపోయిన వారి ఫొటోలూ ఉన్నాయని, అది సరైన పద్ధతి కాదని అన్నారు. దేశంలో బిజెపి ప్రభుత్వ నియంతృత్వ విధానాలు పెరిగిపోతున్నాయన్నారు. అన్యాయాలపై ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టి అరెస్టు చేయడం, బెదిరింపులకు దిగడం కేంద్రానికి అలవాటుగా మారిందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కేంద్ర సంస్థలను వ్యక్తులు, సంస్థలపై ప్రయోగిస్తూ లొంగదీసుకునే చర్యలకు దిగుతున్నారని తెలిపారు. సోషల్ మీడియాలో చేస్తున్న తప్పుడు ప్రచారాలను బయటపెడుతున్న ఆల్ట్ న్యూస్ ప్రతినిది జుబైర్‌ను అరెస్టు చేసి జైల్లో పెట్టారని, సుప్రీం కోర్టు బెయిలు ఇచ్చినా వేరేకేసు బనాయించి అరెస్టు చేశారని తెలిపారు. అమెరికాలో ఫెయిర్ అనే సంస్థ పరిశోధనల్లో వాస్తవాలను బయటపెట్టి పెద్దపెద్ద మీడియా సంస్థలతోనూ క్షమాపణ చెప్పించిన చరిత్ర ఉందని తెలిపారు. అటువంటి పాత్రను దేశంలో ఆల్ట్ న్యూస్ పోషిస్తోందని తెలిపారు. దేశంలో ఎలాంటి పరిస్థితులు నెలకొన్నాయో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చని తెలిపారు. దురదృష్టవశాత్తూ సుప్రీం కోర్టులో కొన్ని బెంచ్‌లు కూడా కొన్ని సందర్భాల్లో ప్రభుత్వ నియంతృత్వ విధానాలకు ఊతమిచ్చే విధంగా వ్యాఖ్యానాలు చేస్తున్నాయని, మొత్తం కోర్టు అలా చేస్తుందని తాను అనడం లేదని ఒక ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. గుజరాత్ మత మారణహోమంపై పోరాడుతున్న తీస్తా సెతల్వాద్ కేసు విషయంలో సుప్రీం కోర్టు బెంచ్ చేసిన వ్యాఖ్యానం అందులో భాగమేనన్నారు. దీంతోకేసును డిస్మిస్ చేసిన రెండోరోజే ఆమెను అరెస్టు చేశారని తెలిపారు. ఇటువంటి విధానాలకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య శక్తులన్నీ ఏకమై పోరాడాలన్నారు. ఈ విషయంలో సిపిఎం తనవంతు పోరాటం చేస్తోందని తెలిపారు. నమ్మకం అనేది వ్యక్తిగతమని, ప్రజలపై ప్రభావం చూపించే సందర్భాల్లో మతాన్ని పక్కనబెట్టి వ్యహరించాలని, ఒక ప్రశ్నకు జవాబిస్తూ దేశానికి నాయకత్వం వహిస్తున్న ప్రధానమంత్రి వంటి వ్యక్తి పార్లమెంటులో పూజలు చేయడం తప్పని అన్నారు. యుపిలో ఒక దేవాలయానికి శంకుస్థాపన చేస్తూ జాతీయ ఆలయమని ప్రకటించడమూ రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. నాయకులు చేస్తున్న విధానాలు లౌకికతత్వంతో, ప్రజలందరినీ ఐక్యం చేసే విధంగా ఉండాలని మరోప్రశ్నకు సమాధానంగా చెప్పారు. పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి, టిడిపి నిరంతరం ఘర్షణ పడుతున్నా బిజెపి నిలబెట్టిన రాష్ట్రపతి అభ్యర్థికి మద్దతు ఇచ్చే విషయంలో మాత్రం పోటీపడ్డాయని అన్నారు. ప్రతి రాజకీయ పార్టీకి ఒక విధానం ఉంటుందని, ఈ విషయంలో రెండు పార్టీలూ దాన్ని పక్కబెట్టాయని అన్నారు. ముర్ముకు మద్దతు ఇవ్వడం వెనుక సామాజిక న్యాయం అని పైకి చెబుతున్నా ఆచరణలో రాజకీయ విధానానికి ఎటువంటి ప్రాధాన్యతా ఇవ్వలేదని తెలిపారు. హోదా, విభజన హామీల అమలు, పోలవరం ప్రాజెక్టు, వెనుకబడిన ప్రాంతాలకు నిధులు తదితర అంశాలపై రాష్ట్రానికి బిజెపి అన్యాయం చేసిందని వైసిపి, టిడిపి రెండూ విమర్శించాయని, ఇప్పుడు ఏం న్యాయం చేశారని మద్దతు ఇచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. ఎన్‌డిఏ, బిజెపి ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను కాలరాస్తోందని తెలిపారు. రాష్ట్రంలో అప్పులు పెరిగిపోయాయని బిజెపి నాయకులు విమర్శిస్తున్నారని, దీనికి కేంద్రం అనుసరిస్తున్న విధానాలే కారణమని అన్నారు. రాష్ట్రాలకు సంబంధించిన అంశాల్లోనూ కేంద్రం జోక్యం చేసుకుని ఫెడరలిజానికి తూట్లు పొడుస్తోందని, దీన్ని వైసిపి ప్రశ్నించడం లేదని తెలిపారు. గతంలో వేర్వేరు కార్పొరేషన్ల కింద ఉన్న అప్పులనూ చూపించి రాష్ట్రాలు అప్పుల పాలయ్యాని చెబుతోందని, సొంతంగా అప్పులు చేయాలంటే షరతులు పెడుతోందని తెలిపారు. ఆ పేరుతో ప్రజలపై భారాలు మోపుతోందని, విద్యుత్ మీటర్లు, చెత్తపన్ను వంటివన్నీ ఇలాంటివేనని పేర్కొన్నారు. ఈ విషయంలో కేంద్రాన్ని ఎదిరించాల్సిన వైసిపి, టిడిపి దానికి భజన చేస్తున్నాయని విమర్శించారు. రాజకీయాల్లోనూ, అధికారంలోనూ ఎవరూ శాశ్వతంగా ఉండరని, అలా అనుకున్నవారందరూ ముందుగానే పదవులకు దూరమయ్యారని పేర్కొన్నారు. రాజకీయాల్లో శాశ్వత పదవులంటూ ఏమీ ఉండవని వివరించారు.

ICICI Home Finance | కార్పొరేట్ కార్యాలయం: ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ ఐసిఐసిఐ హెచ్ఎఫ్‌సి టవర్, అందేరి -కుర్లా రోడ్, అందేరి (ఈస్ట్), ముంబాయి-400059, ఇండియా

శాఖ కార్యాలయం: ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్, ఐసిఐసిఐ హెచ్ఎఫ్‌సి, డా॥ ఎన్.వి. రమేష్ కాం